తెలంగాణను దాటి ఒడిశా దూకుడు

- ఒకేసారి 8 అవగాహనా ఒప్పందాలపై సంతకాలు
- ఎంవోయూల కోసం సింగపూర్ వెళ్లిన ముఖ్యమంత్రి రేవంత్
- తీరా ఒడిశాకే వచ్చిన సింగపూర్ అధ్యక్షుడు షణ్ముగరత్నం
- సోషల్ మీడియాలో ఆసక్తికరమైన చర్చ

హైదరాబాద్, జనవరి 20(నమస్తే తెలంగాణ): సింగపూర్‌తో అవగాహనా ఒప్పందాల (ఎంవోయూ) విషయంలో ఒడిశా దూకుడు ప్రదర్శిస్తున్నది . తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని బృందం సింగపూర్ పర్యటనకు వెళ్లి రెండు ఎంవోయూలు కుదుర్చుకోగా.. ఏకంగా సింగపూర్ అధ్యక్షుడే ఒడిశా వచ్చి 8 ఒప్పందాలపై సంతకాలు చేయడం ఆసక్తికరంగా మారింది. ఈ నెలాఖరులో భువనేశ్వర్‌లో నిర్వహించనున్న ఒడిశా ఇన్వెస్టర్ సమ్మిట్‌కు ముందు ఈ ఒప్పందాలు జరగగా, ఈ కార్యక్రమంలో ఒడిశా ముఖ్యమంత్రి మోహన్‌చరణ్‌తోపాటు సింగపూర్ అధ్యక్షుడు థర్మన్ షణ్ముగరత్నం పాల్గొనడం విశేషం. మన రాష్ట్ర సీఎం సింగపూర్‌లో కంపెనీలతో ఒప్పందాలు చేసుకుంటే, ఒడిశా రాష్ట్రం మాత్రం అక్కడి దేశాధ్యక్షుడి సమక్షంలో వివిధ ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలతో ఒప్పందాలు చేసుకోవడం ఇప్పుడు సోషల్ మీడియాలో చర్చనీయాంశమైంది. నెటిజన్లు ఈ అంశంపై రెండు రాష్ట్రాలను పోల్చుకుంటూ పలు కామెంట్లు పెడుతున్నారు.

సీఎం రేవంత్ నేతృత్వంలోని రాష్ట్ర ప్రతినిధి బృందం రెండురోజులపాటు సింగపూర్‌లో పర్యటించి ప్రపంచ వాణిజ్య వేదిక సదస్సులో పాల్గొనేందుకు దావోస్‌కు బయల్దేరిన విషయం విదితమే. ఈ సందర్భంగా సింగపూర్‌లో రాష్ట్ర బృందం సుమారు రూ.3,950 కోట్ల విలువైన రెండు ఒప్పందాలు కుదుర్చుకున్నది. అదే సమయంలో సింగపూర్ అధ్యక్షుడు షణ్ముగరత్నం ఒడిశాలో పర్యటించగా, ఆయన సమక్షంలో ఒడిశా–సింగపూర్ ప్రభుత్వాల మధ్య ఎనిమిది ఎంవోయూలు జరిగాయి. రాష్ట్ర ప్రతినిధి బృందం సింగపూర్, దావోస్ పర్యటనకు సుమారు రూ.12.5 కోట్లు ఖర్చవుతున్నట్టు అంచనా. కాగా, ఒడిశా ఒక్క రూపాయి కూడా ఖర్చుచేయకుండానే సింగపూర్ బృందాన్నే తమ రాష్ట్రానికి ఆహ్వానించి అనేక విలువైన ఒప్పందాలు చేసుకున్నదని నెటిజన్లు కామెంట్లు చేస్తున్నారు.

రేవంత్‌రెడ్డి, చంద్రబాబు భేటీ

- జ్యూరిచ్ విమానాశ్రయంలో కలుసుకున్న ఇద్దరు సీఎంలు

హైదరాబాద్, జనవరి 20 (నమస్తే తెలంగాణ): సీఎం రేవంత్‌రెడ్డి, ఏపీ సీఎం చంద్రబాబునాయుడు సోమవారం భేటీ అయ్యారు. దావోస్‌లో జరుగుతన్న ప్రపంచ ఆర్థిక సదస్సులో (డబ్ల్యూఈఎఫ్) పాల్గొనేందుకు సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని బృందం సోమవారం స్విట్జర్లాండ్ లోని జ్యూరిచ్‌కు చేరుకున్నది. అదే సమయంలో ఏపీ సీఎం చంద్రబాబు బృందం కూడా అక్కడికి వచ్చింది. దీంతో రెండు రాష్ట్రాల సీఎంలు, మంత్రులు కాసేపు భేటీ అయ్యారు. ఇరు రాష్ట్రాల్లో పరిస్థితులపై చర్చించుకున్నారు. ఈ భేటీలో రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు, ఏపీ మంత్రి లోకేశ్, కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఓటరు నమోదుకు సహకరించండి

- రాజకీయ పార్టీలతో సీఈవో సుదర్శన్‌రెడ్డి

హైదరాబాద్, జనవరి 20 (నమస్తే తెలంగాణ): ఓటరు నమోదు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించేందుకు సహకరించాలని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి(సీఈవో) సుదర్శన్‌రెడ్డి రాజకీయ పార్టీలను కోరారు. సోమవారం హైదరాబాద్ బీఆర్కే భవన్‌లో బీజేపీ, ఎంఐఎం, ఆమ్ ఆద్మీ పార్టీ, సీపీఎం, సీపీఐ(ఎం) తదితర రాజకీయ పార్టీల ప్రతినిధులతో భేటీ అయ్యారు. ఎలక్టోరల్ ప్రక్రియకు సంబంధించిన కీలక అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా సీఈవో మాట్లాడుతూ.. 'స్పెషల్ సమ్మరీ రివిజన్–2025' ముద్రణ ఈ నెల 6తో ముగిసినట్టు తెలిపారు. ఓటర్ల నమోదు పారదర్శకత కోసం ప్రజాప్రతినిధుల భాగస్వామ్యం అవసరమని చెప్పారు. ఈ నెల 25న జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని నిర్వహించనున్నట్టు, కార్యక్రమానికి గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్టు వెల్లడించారు. ఓటర్లకు అవగాహన కల్పించే ప్రక్రియలో రాజకీయ పార్టీలు చురుగ్గా పాల్గొనాలని కోరారు.

క్లైమాక్స్‌కు లిక్కర్‌రేట్లు!

- తెలంగాణలో బీర్ల సరఫరాను పునరుద్ధరిస్తున్నట్టు యూబీ ప్రకటన
- ధరల పెంపుపై సర్కారు సానుకూలంగా స్పందించిందని బీఎస్‌ఈకి లేఖ
- బీరు బేసిక్ ధర మీద 19% అదనంగా పెంచేందుకు ప్రభుత్వం సూచనప్రాయ అంగీకారం
- ధరల పెంపు కోసం ప్రభుత్వం, బీరు కంపెనీల దొంగాటను ముందే చెప్పిన 'నమస్తే తెలంగాణ'

మద్యం ధరల పెంపుపై దొంగాట!

- లిక్కర్ రేట్ల పెంపునకు ఇప్పటికే సర్కారు నిర్ణయం!
- 6 నెలల కిందనే ఐదుగురు సభ్యుల కమిటీ సిఫారసు
- ప్రభుత్వం, కంపెనీల మధ్య ఉత్తుత్తి భిన్నాభిప్రాయాలు!
- తప్పదోవ పట్టించేందుకే విభేదాల నాటకం!
- బీర్ల సరఫరా నిలిపివేస్తామని ప్రముఖ కంపెనీ వెల్లడి

పెంచాలని మద్యం కంపెనీలు కోరడం, ప్రభుత్వం తిరస్కరించడం తరచుగా జరుగుతూ ఉంటుంది. 2023లో కూడా మద్యం కంపెనీలు బేసిక్ ధర పెంచాలని కోరగా అప్పటి కేసీఆర్ ప్రభుత్వం తిరస్కరించింది. కానీ ఇప్పుడు మద్యం ధరలు పెంచడానికే కాంగ్రెస్ ప్రభుత్వం మొగ్గుచూపుతున్నట్టు సమాచారం. కానీ ప్రజల నుంచి వ్యతిరేకతను తప్పించుకునేందుకు ప్రభుత్వ పెద్దలు కొత్త ఎత్తుగడ

హైదరాబాద్, జనవరి20(నమస్తే తెలంగాణ): యూబీ కంపెనీ తెలంగాణలో బీర్ల సరఫరాను పునరుద్ధరించింది. బీర్ల ధరల పెంపు, పాత బకాయిలు చెల్లింపులకు టీజీబీసీఎల్ సానుకూలంగా స్పందించిందని, తమ బ్రాండ్ ఉత్పత్తులను తెలంగాణలో విక్రయిస్తామని బీఎస్‌ఈ స్టాక్ ఎక్స్ఛేంజ్‌కి సోమవారం లేఖ రాసింది. అదే లేఖను సోషల్‌మీడియాలో పోస్ట్ చేసింది. తెలంగాణలో జనవరి 8 నుంచి తమ బ్రాండ్ బీర్ల సరఫరా నిలిపివేస్తున్నట్టు యూబీ ప్రకటించిన విషయం తెలిసిందే. యూబీ ఎందుకు ఏకపక్షంగా బీర్ల సరఫరాను నిలిపివేసిందో, మళ్లీ ఎందుకు పునరుద్ధరించిందో అర్థంచేసుకోవటం పెద్ద కష్టమేమీ కాదు. బీర్ల ధరల పెంపు కోసం బేవరేజస్ కంపెనీలు, రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు కలిసే దొంగాట ఆడుతున్నారని ముందే పసిగట్టిన 'నమస్తే తెలంగాణ' ఈ నెల 12న 'లిక్కర్ రేట్లపై దొంగాట' శీర్షికన కథనం ప్రచురించింది. 'డిస్టిలరీలు, బ్రూవరీలు, సప్లయ్ కంపెనీలు కోరిన బేసిక్ ధరలు చెల్లించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏనాడో రంగం సిద్ధంచేసిందని, ఆరు నెలల కిందటే ఐదుగురు సభ్యులతో కూడిన ధరల నిర్ణయ కమిటీని నియమించిందని, ఆ కమిటీ నివేదిక ముఖ్యమంత్రి వద్ద ఉన్నదని, అయితే ధరల పెరుగుదలతో వచ్చే వ్యతిరేకత నుంచి తప్పించుకోవడానికే అకస్మికంగా బీర్ల సరఫరా నిలివేత నాటకానికి తెరలేపారని 'నమస్తే తెలంగాణ' కథనం వివరించింది. అందుకు తగ్గట్టుగానే బీరు బేసిక్ ధర మీద కనీసం 19% అదనంగా చెల్లించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సూచనప్రాయంగా అంగీకరించినట్టు తెలిసింది.

బీర్ల నిల్వలు అయిపోగానే..

రాష్ట్రంలో మద్యం కంపెనీలు సరఫరా నిలిపివేయడం, తీవ్రస్థాయిలో డిమాండ్ ఉన్నప్పుడు సరఫరా ఆపివేస్తామంటూ బెదిరించడం కొత్తేమీ కాదు. గతంలో కూడా ఇదే మల్టీనేషనల్ బీర్ల కంపెనీ తమ ఉత్పత్తుల సరఫరాను నిలిపివేసింది. రాష్ట్రంలో టీజీబీసీఎల్ డిపోలు, బీర్ల కంపెనీల గోదాములు, మద్యం దుకాణాల్లో కలిపి 20 లక్షల కేసుల బీరు అందుబాటులో ఉన్నట్టు ఎక్సైజ్ అధికారులు లెక్కలుకట్టారు. రాష్ట్రంలో రోజుకు సగటున లక్ష కేసుల బీర్ల వినియోగం జరుగుతున్నది. ఇది చలికాలం కాబట్టి బీర్ల వినియోగ డిమాండ్ తక్కువగానే ఉంటుందని ముందుగానే అంచనా వేశారు. బీర్ల నిల్వలు అయిపోయేంతవరకు కంపెనీ, ప్రభుత్వం డ్రామాను రక్తికట్టించాయి. బీర్ల ఉత్పత్తి నిలిచిపోవడంతో కంపెనీలో మొలాసిస్ నిల్వలు భారీగా పెరిగిపోయాయి. ఒకవైపు గోదాముల్లో బీర్ల నిల్వలు తరిగిపోవడం, మరోవైపు బేవరేజీల్లో మొలాసిస్ నిల్వలు పెరిగిపోవడం, మరోవైపు స్టాక్‌మార్కెట్‌లో కంపెనీ షేర్ల విలువలు పతనం కావడంతో మద్యం రేట్ల ఫిక్సింగ్ ఆటకు తెరపడిందని ఎక్సైజ్ అధికారులు చెప్తున్నారు.

19% పెంపుదలకు గ్రీన్‌సిగ్నల్

రాష్ట్ర మద్యం మార్కెట్‌లో దాదాపు 60% వాటా ఉన్న మల్టీనేషనల్ బీర్ల కంపెనీ తమకు ప్రస్తుతం చెల్లిస్తున్న బేసిక్ ధర మీద కనీసం 30.1% అదనపు ధర చెల్లించాలని కోట్ చేసింది. ఈ కంపెనీ డిమాండ్‌నే మిగిలిన కంపెనీలూ అనుసరించాయి. ఈ నేపథ్యంలో మధ్యేమార్గంగా 19% మేరకు బీర్ బేసిక్ ధర పెంచడానికి రాష్ట్ర ప్రభుత్వం సూచనప్రాయంగా అంగీకరించినట్టు తెలిసింది. ఒక్క బీర్ల పెట్టె మీద 19% బేసిక్ ధర పెంచితే, దానికి కనీసం 300% వ్యాట్, ఎక్సైజ్ సుంకంతో పాటు వివిధ రకాల పన్నులు జత కలుస్తాయి. అదే జరిగితే ప్రస్తుతం రూ.150 ఉన్న లైట్ బీరు రూ.180 వరకు, రూ.160 ధర ఉన్న స్ట్రాంగ్‌బీరు ధర రూ.200 వరకు పెరగవచ్చని టీజీబీసీఎల్ అంచనా వేస్తున్నది. ఇంతగా మద్యం ధరలు పెరిగితే ప్రజల నుంచి వ్యతిరేకత వస్తుందనే ఆలోచనతో ప్రభుత్వం నాటకాన్ని రక్తికట్టించిందని, ఇప్పుడు ధరలు పెంచకతప్పలేదని చెప్పడానికి ప్రభుత్వానికి అవకాశం దొరికినట్టు అయిందని టీజీబీసీఎల్ అధికారి ఒకరు 'నమస్తే తెలంగాణ' ప్రతినిధికి వివరించారు.

దిగువశ్రేణి కంపెనీలకు బిజినెస్ స్ట్రోక్

నిబంధన ప్రకారం సదరు మల్టీనేషనల్ బీర్ల కంపెనీ టీజీబీసీఎల్‌తో 2024 ఏప్రిల్ 1 నుంచి 2025 మార్చి 31 వరకు బీర్లు సరఫరా చేస్తామని ఒప్పందం చేసుకున్నది. ఈ ఒప్పందం ప్రకారం మార్చి 31 వరకు బీర్ల సరఫరా చేయాల్సి ఉన్నది. కానీ, అర్ధాంతరంగా బీర్ల సరఫరా నిలిపివేసింది. పెద్ద కంపెనీ బీర్ల సరఫరా ఆగిపోవటంతో. దిగువశ్రేణి కంపెనీలు తమ బ్రాండ్ ఉత్పత్తులను భారీగా పెంచుకున్నాయి. ప్రధానంగా రాష్ట్రంలో రెండోస్థానంలో ఉన్న ఒక బీర్ల కంపెనీ ప్రత్యేక అనుమతులు తీసుకొని తమ బ్రాండ్ బీర్ల పరిమితిని పెంచి సరఫరా చేసింది. ఈ బీర్లు ప్రస్తుతం టీజీబీసీఎల్ డిపోలు, గోదాముల్లో నిల్వ ఉన్నాయి. ఈ ఉత్పత్తులను దెబ్బతీస్తూ యూబీ మళ్లీ తమ బ్రాండ్‌ను సరఫరా చేస్తున్నట్టు ప్రకటించడంతో, దిగువశ్రేణి కంపెనీలకు బిజినెస్‌స్ట్రోక్ ఇచ్చినట్టు అయిందని పేరు చెప్పడానికి ఇష్టపడని బీర్ల కంపెనీ వ్యాపారి పేర్కొన్నారు. తాము ఉత్పత్తి చేసిన బీర్లు 3 నెలల్లోగా అమ్ముడుపోకపోతే, ఆ తరువాత ప్రతి నెలకు పెట్టె మీద రూ.90 గోదాం చార్జీలు వసూలుచేస్తారని, అంత భారం మోయడం సాధ్యం కాదు కాబట్టి, మూడు నెలల అనంతరం మిగిలిన స్టాక్ మొత్తాన్ని పారబోయాల్సి వస్తుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇది ఎవరూ పూడ్చలేని నష్టమని ప్రభుత్వం, పెద్ద కంపెనీ కలిసే తమను దెబ్బకొట్టాయని వాపోయారు. కోర్టుకు వెళ్లి పెద్ద కంపెనీకి ముకుతాడు వేయాల్సిన ప్రభుత్వం, వారి డిమాండ్‌కు తలొగ్గడం విడ్డూరమని అన్నారు. కాగా సోమవారం సాయంత్రం సచివాలయంలో ఎక్సైజ్ శాఖ డైరెక్టర్ హరికిరణ్, ఎక్సైజ్ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ, బీర్ల కంపెనీల యాజమాన్యంతో సమావేశమయ్యారు. ఆయా కంపెనీల పెండింగ్ బిల్లుల వివరాలు తీసుకున్నట్టు తెలిసింది. ధరల నిర్ణయ కమిటీ చేసిన సిఫారసుల మీద కూడా చర్చించినట్టు సమాచారం.

రాజ్యాంగంపై 26న తెలంగాణ సెమినార్

- ఎమ్మెల్సీ కవిత కీలకోపన్యాసం

హైదరాబాద్, జనవరి 20 (నమస్తే తెలంగాణ): 75వ రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 26న తెలంగాణ జాగృతి విద్యార్థి విభాగం తెలంగాణ సారస్వత పరిషత్‌లో 'గణతంత్ర భారత్ – జాగ్రత్త భారత్' అంశంపై సెమినార్ నిర్వహించనున్నది. సెమినార్‌లో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత కీలకోపన్యాసం చేయనున్నారని విద్యార్థి విభాగం నేతలు తెలిపారు. రాజ్యాంగ స్ఫూర్తిని రక్షించడంలో సవాళ్లు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సంబంధాలు, మహిళలు, మైనారిటీలు, బలహీనవర్గాల సాధికారత, కులగణన సహా 16 అంశాలపై సెమినార్‌లో చర్చించనున్నారు. భారత రాజ్యాంగ స్ఫూర్తిని నిలబెట్టేందుకు, ఫలాలను మరింత విస్తృతంగా అన్ని వర్గాలు ప్రజలందరి భాగస్వామ్యం అవసరమని, ఆదిశగా జరుగుతున్న ప్రయత్నంలో భాగంగానే ఈ సదస్సు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. సదస్సు పోస్టర్‌ను సోమవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో నవీన్ ఆచారి, చరణ్ పసుల, శ్రీకాంత్‌గౌడ్, లింగం, డాక్టర్ సత్య, వసుమతి, కృష్ణకిశోర్, శ్రీనివాస్‌గౌడ్, మాడహ రీశ్రీధ రెడ్డి, జన్ము రాజు, అశోక్ యాదవ్, గాజుల అరుణ్ పాల్గొన్నారు.

సాగుకు అనువుగాని భూములు గుర్తించండి

- అధికారులకు తుమ్మల నాగేశ్వరరావు ఆదేశాలు

హైదరాబాద్, జనవరి 20(నమస్తే తెలంగాణ): ప్రభుత్వ ఆదేశాల ప్రకారం సాగుకు అనువుగాని భూములను గుర్తించి గ్రామసభల్లో వివరాలు అందుబాటులో ఉంచాలని జిల్లా అధికారులను వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. సోమవారం రైతుభరోసా సర్వేపై మంత్రి సమీక్ష నిర్వహించారు. కొత్తగా చేరిన పట్టాదారుల బ్యాంకు వివరాలను ఏఈవోల ద్వారా నమోదు చేయించాలని సూచించారు. రైతుల వద్ద మిగిలిన పత్తిని మద్దతు ధరకు కొనుగోలు చేయాలని మార్కెటింగ్ అధికారులను ఆదేశించారు. ఇతర పంటలకు కూడా మద్దతు ధర ఇచ్చేలా చూడాలని సూచించారు. ఫిర్యాదుల విభాగానికి అందే సమస్యలను సకాలంలో పరిష్కరించకపోతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

పాట్నాలో ప్రిసైడింగ్ ఆఫీసర్స్ కాన్ఫరెన్స్

- మండలి చైర్మన్ గుత్తా, స్పీకర్ ప్రసాద్ హాజరు

హైదరాబాద్, జనవరి 20 (నమస్తే తెలంగాణ): 85వ ఆలిండియా ప్రిసైడింగ్ ఆఫీసర్స్ కాన్ఫరెన్స్ బీహార్ రాజధాని పాట్నాలో సోమవారం అట్టహాసంగా ప్రారంభమైంది. ఈ సదస్సుకు రాష్ట్ర శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ బండా ప్రకాశ్, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ నేతృత్వంలోని బృందం హాజరైంది. లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా సహా దేశంలోని దాదాపు అన్ని రాష్ట్రాల ప్రిసైడింగ్ ఆఫీసర్లు హాజరైన ఈ సదస్సులో చట్టసభల నిర్వహణ, సభ్యుల గౌరవం, ప్రజాస్వామ్య పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు.

ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్‌గా సురేంద్రమోహన్ బాధ్యతలు

హైదరాబాద్ సిటీబ్యూరో, జనవరి 20 (నమస్తే తెలంగాణ) : ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్(రెగ్యులర్)గా సురేంద్రమోహన్ సోమవారం పూర్తిస్థాయి బాధ్యతలు స్వీకరించారు. కాగా, ఇప్పటి వరకు ఆయన అదనపు బాధ్యతలు నిర్వర్తించారు. ఆయనకు హైదరాబాద్ జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ రమేశ్ పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

కక్ష సాధింపులతో పశ్చాత్తాపం తప్పదు

- ప్రతిపక్షాన్ని జైలుకు పంపే చర్యలు మంచివి కావు: జగ్గారెడ్డి

హైదరాబాద్, జనవరి 20 (నమస్తే తెలంగాణ): తెలంగాణ ప్రజల రక్తంలో కక్ష సాధింపు గుణం లేదని, రివేంజ్ పాలిటిక్స్ చేస్తే పశ్చాత్తాపం తప్పదని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి వ్యాఖ్యానించారు. కక్ష సాధింపు రాజకీయాలకు తాను వ్యతిరేకమని, రాజకీయంగా యుద్ధం చేసి గెలిచేందుకు ఇష్టపడుతానని చెప్పారు. సోమవారం సెంట్రల్ కోర్టులో మీడియాతో చిట్‌చాట్ చేసిన జగ్గారెడ్డి అధికారంలో ఉన్నాం కదా అని ప్రతిపక్ష నేతలను జైలుకు పంపిండం తాత్కాలికమైన చర్యగా అభివర్ణించారు. సంగారెడ్డిలో తన ఓటమిపైనా జగ్గారెడ్డిల అభిప్రాయాలు పంచుకున్నారు. ఓ ప్రధాన సామాజికవర్గం ఓట్లు వేయకపోవడం వల్లే ఓడిపోయినట్టు చెప్పారు. 2023 సాధారణ ఎన్నికలకు 6 నెలల ముందు తనకు పోటీ చేసే ఆలోచనే లేదని తెలిపారు. ఏ రాజకీయ నాయకుడైనా పైసలు తీసుకోకుండా రాజకీయం చేయగలరా అని జగ్గారెడ్డి వ్యాఖ్యానించారు.

ఆరోగ్యశ్రీ సేవలు పునఃప్రారంభం

- ప్రతినిధులతో మంత్రి దామోదర చర్చలు

హైదరాబాద్, జనవరి 20 (నమస్తే తెలంగాణ): ప్రైవేట్ దవాఖానల్లో ఆరోగ్యశ్రీ సేవలు పునఃప్రారంభం అయ్యాయి. వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహా సోమవారం నెట్‌వర్క్ హాస్పిటళ్ల ప్రతినిధులతో చర్చలు జరిపారు. అనంతరం ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ హాస్పిటళ్ల అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ రాకేశ్, ప్రధాన కార్యదర్శి హరిప్రకాశ్ వీడియో విడుదల చేశారు. చర్చలు సఫలం అయ్యాయని ప్రకటించారు. ఆర్థిక సంబంధ డిమాండ్లను 4–5 నెలల్లో పూర్తి చేస్తామని మంత్రి హామీ ఇచ్చినట్టు తెలిపారు. ఈ నేపథ్యంలో సోమవారం రాత్రి నుంచి ప్రైవేట్ దవాఖానల్లో ఆరోగ్యశ్రీ సేవలను యథావిధిగా కొనసాగిస్తున్నట్టు వెల్లడించారు.

ముగిసిన పోలీస్ ఆరోగ్య భద్రత

- రాష్ట్రవ్యాప్తంగా దవాఖానల్లో నిలిచిన అడ్మిషన్లు
- తీవ్ర అవస్థలు పడుతున్న పోలీసు కుటుంబాలు
- వంద కోట్లు ఇవ్వలేమని చేతులెత్తేసిన ఆర్థికశాఖ
- 24న విదేశాల నుంచి రానున్న ముఖ్యమంత్రి
- ఆరోగ్య భద్రత కార్యాలయానికి కాల్స్ తాకిడి
- 15 రోజులు ముందే హెచ్చరించినా చలనం లేని ప్రభుత్వం
- చర్చలు జరుగుతున్నాయి: డీజీపీ జితేందర్

సీఎం రేవంత్‌రెడ్డి విదేశీ పర్యటనలో ఉన్న నేపథ్యంలో ఆయన వస్తేనే ఈ పథకంపై పూర్తిస్థాయిలో చర్చలు ఉంటాయని విశ్వసనీయ సమాచారం. సీఎం తన విదేశీ పర్యటనను ముగించుకొని 24న హైదరాబాద్‌కు వస్తారు. అదేరోజు దీనిపై చర్చిస్తారా? లేదా? అనేది ప్రశ్నార్థకంగా ఉంది.

హైదరాబాద్, జనవరి 20 (నమస్తే తెలంగాణ): పోలీసు కుటుంబాల వైద్యానికి నిధులు విడుదల చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం క్షోభపెడుతున్నది. పోలీసు ఆరోగ్య భద్రత పథకం కింద ఈ నెల 20 నుంచి వైద్యసేవలు అందించబోమని తెలంగాణ స్పెషాలిటీ హాస్పిటల్స్ అసోసియేషన్ ఈ నెల 6న హెచ్చరించినా ప్రభుత్వంలో చలనం లేదు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 200 దవాఖానల్లో ఆయా వైద్యసేవలు నిలిచిపోయాయి. రాష్ట్రానికి హోంశాఖ మంత్రి లేకపోవడం, ఆ శాఖ కూడా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వద్దనే ఉండటంతో తమ బాధలు ఎవరికి చెప్పుకోవాలో తెలియడం లేదని పోలీసు కుటుంబాలు కన్నీటి పర్యంతమవుతున్నాయి. ప్రస్తుతం మల్లు భట్టివిక్రమార్క దృష్టికి అధికారులు తీసుకెళ్లగా, ముఖ్యమంత్రి విదేశాల నుంచి వచ్చిన తరువాత చర్చించి నిర్ణయం తీసుకుంటామని ఆయన చెప్పినట్టు సమాచారం.

నిలిచిపోయిన ఆరోగ్య భద్రత సేవలు

తెలంగాణ స్పెషాలిటీ హాస్పిటల్స్ అసోసియేషన్ ప్రభుత్వానికి ఇచ్చిన గడువు సోమవారంతో ముగిసిపోవడంతో రాష్ట్రవ్యాప్తంగా పోలీసులకు, వారి కుటుంబసభ్యులకు వైద్యసేవలు నిలిచిపోయాయి. హైదరాబాద్ నగరంలోని రెండు కార్పొరేట్ దవాఖానలు మినహా, మరెక్కడా ఆరోగ్య భద్రతపై అడ్మిషన్స్ నమోదు కాలేదని సమాచారం. డబ్బులు ఇస్తేనే వైద్యం చేస్తామని దవాఖానలు తెగేసి చెప్పడంతో, సుమారు 60 నుంచి 70 కుటుంబాలవారు డబ్బులు కట్టి అడ్మిషన్ తీసుకున్నట్టు సమాచారం. వైద్యసేవలు నిలిచిపోయిన నేపథ్యంలో పోలీసు ఆరోగ్య భద్రత కార్యాలయానికి బాధిత కుటుంబాల నుంచి ఫోన్‌కాల్స్ తాకిడి పెరిగింది. దీంతో ఎవరికి, ఏ సమాధానం చెప్పాలో తెలియక ఆరోగ్య భద్రత కార్యదర్శి సతమతమైనట్టు తెలుస్తున్నది. సిబ్బంది సైతం ఒకానొక దశలో సమాధానం చెప్పలేక ఫోన్లు కట్ చేసినట్టు తెలిసింది. కాగా, అప్పటికప్పుడు వైద్యానికి డబ్బులు దొరక్క కొందరు పోలీసు కుటుంబాలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. 'హోం శాఖ మంత్రి ఉంటే.. ఆయనకైనా తమ గోడు చెప్పుకునేవాళ్లం' అంటూ పోలీసులు, ఇతర అధికారులు ఆవేదన వ్యక్తంచేశారు. ప్రభుత్వం తక్షణం బకాయిలు విడుదలచేయాలని పోలీసులు డిమాండ్ చేస్తున్నారు. లేకపోతే ఆందోళనలు చేయాల్సి వస్తుందని హెచ్చరిస్తున్నారు.

ఆర్థికశాఖ దృష్టికి ఆరోగ్య భద్రత సమస్య

పోలీసు ఆరోగ్య భద్రత పథకం సమస్యలు, పెండింగ్ బిల్లులకు సంబంధించిన ఫైలు ప్రస్తుతం సచివాలయంలోనే ఉన్నది. రెండ్రోజులుగా పోలీసు కుటుంబాలకు ఎదురవుతున్న సమస్యలు, వాటి తీవ్రతను పోలీసు ఉన్నతాధికారులు ఆర్థిక శాఖ దృష్టికి తీసుకెళ్లినట్టు విశ్వసనీయ సమాచారం. కనీసం రూ.వంద కోట్లు అయినా విడుదల చేస్తే, ప్రస్తుతానికి చికిత్స తీసుకుంటున్నవారికి వైద్యం నడుస్తుందని అధికారులు చెప్పినట్టు తెలిసింది. అంత డబ్బు ఇప్పటికిప్పుడు విడుదల చేసేందుకు ఆర్థికశాఖ సుముఖంగా లేదని తెలిసింది. సమస్య తీవ్రతను ఆర్థికశాఖ మంత్రి చూస్తున్నారు. సమస్య తీవ్రతను అంచనా వేస్తూ తెలంగాణ ప్రభుత్వం అత్యున్నత స్థాయిలో చర్చిస్తున్నది. వీలైనంత త్వరగా నిధులు విడుదలచేయాలని ఆశిస్తున్నాం. దీని దృష్ట్యా, సేవలను నిలిపివేసే అవకాశం లేదు. ప్రభుత్వం, పోలీసుశాఖ అన్ని స్థాయిల్లోని పోలీసు అధికారుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాయి. ఏ సిబ్బందీ భయపడాల్సిన అవసరం లేదు. పోలీసుశాఖ, ప్రభుత్వ స్థాయిలోని సీనియర్ నాయకులు నిధుల విడుదలకు అన్ని ప్రయత్నాలు చేస్తున్నారు' అంటూ డీజీపీ జితేందర్ 'నమస్తే తెలంగాణ'కు ప్రకటన రూపంలో వివరణ ఇచ్చారు.

చర్చలు జరుగుతున్నాయి: డీజీపీ

ఆరోగ్య భద్రత పథకానికి సంబంధించిన సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం అత్యున్నత స్థాయిలో చర్చిస్తున్నదని డీజీపీ జితేందర్ తెలిపారు. 'తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి తెలంగాణ స్పెషాలిటీ హాస్పిటల్స్ అసోసియేషన్ (టీఎస్‌హెచ్‌ఏ) పోలీస్ శాఖకు సంబంధించిన ఆరోగ్య భద్రత పథకానికి నగదు రహిత చికిత్స అందిస్తున్నది. ఈ నెల 6న ఆరోగ్య భద్రత లబ్ధిదారులకు నగదు రహిత చికిత్సను ఉపసంహరించుకుంటున్నట్టు అసోసియేషన్ ప్రభుత్వానికి సమాచారం ఇచ్చింది. వారికి బకాయిలు రాకపోవడంతో భారీ ఆర్థిక నష్టాలను చవిచూస్తున్నారు. సమస్య తీవ్రతను అంచనా వేస్తూ తెలంగాణ ప్రభుత్వం అత్యున్నత స్థాయిలో చర్చిస్తున్నది. వీలైనంత త్వరగా నిధులు విడుదలచేయాలని ఆశిస్తున్నాం. దీని దృష్ట్యా, సేవలను నిలిపివేసే అవకాశం లేదు. ప్రభుత్వం, పోలీసుశాఖ అన్ని స్థాయిల్లోని పోలీసు అధికారుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాయి. ఏ సిబ్బందీ భయపడాల్సిన అవసరం లేదు. పోలీసుశాఖ, ప్రభుత్వ స్థాయిలోని సీనియర్ నాయకులు నిధుల విడుదలకు అన్ని ప్రయత్నాలు చేస్తున్నారు' అంటూ డీజీపీ జితేందర్ 'నమస్తే తెలంగాణ'కు ప్రకటన రూపంలో వివరణ ఇచ్చారు.

గురుకులంలో విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

సూర్యాపేట టౌన్, జనవరి 20 : సూర్యాపేట జిల్లా కేంద్రంలోని బీసీ గురుకుల విద్యాలయంలో 9వ తరగతి విద్యార్థిని ఆత్మహత్యకు యత్నించింది. పట్టణ పరిధిలోని బీబీగూడేనికి చెందిన వల్లపు సైదులు పెద్ద కూతురు సంగీత ఇదే గురుకులంలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం, రెండో కూతురు హర్షిత 9వ తరగతి చదువుతున్నారు. ఇద్దరూ సంక్రాంతికి ఇంటికి వెళ్లగా, సెలవులు ముగియడంతో తల్లిదండ్రులు సోమవారం వారిని పాఠశా